ఈ గెల్చిన వాళ్ళలో తనెవరికీ తీసిపోలేదు. ఇవన్నీ అతనికి సముజ్వల భవిష్యత్తుపట్ల ప్రగాఢ విశ్వాసం కలిగించాయి. సరాసరి పజిలు కట్టేశాడు,

పజిలు ప్రయిజు చేతికందేలోగా మావయ్య వస్తాడు. అందుకని అర్జెంటుగా కాస్త డబ్బు సంపాదించాలి.

పేకాట పసందయిన దారి. అడా బేడా పట్టికెళ్ళి ఐదొందలు సంపాదించే వాళ్ళ కథలుకూడా అతను విన్నాడు. కాని, ఎలాగేనా ఇది పజిలు లాంటిది కాదు. పిండికొద్దీ రొట్టి అన్నారు.

చేతిలోని రొక్కం రూపాయిల లెక్కలోలా ఉంది కాబట్టి గెలుపు ఖాయం, అతని అంతర్వాణి శతసహస్ర కంఠాలతో ఘోషించింది.

చెప్పుడు మాటలు విని చెడేవాడు కాడు కాబట్టి మనసుకు తోచినట్టు ముక్కుకు సూటిగా పోయేవాడు కాబట్టి గురునాధరావు సరాసరి పేకాట కాటవికి వేటకెళ్ళాడు—చేతిలో జెర్రిపోతులాటి ధనరేఖ గుర్రుపెట్టి నిద్ర పోయింది కాబోలు. జేబులో అయిదారు రూపాయిలూ ఖాయిలాపడి క్షణాలమీద చిక్కి సగమై మళ్ళీ సగమై శల్యమై హారతి కర్పూరంలో హరించిపోయాయి. వంటిమీదకి తెలివి వచ్చేసరికి గురునాధరావు ఇంకో గురునాధ కుమారుడికి పది రూపాయలు బాకీ తేలాడు.

ఈ ధార్తరాష్ట్రుడు మహధూర్తుడు.

తే, నాపదీ తే అన్నాడు—తేకపోతే చావగొడతానన్న భావం స్ఫురింపజేస్తూ. గురునాధరావు అట్టె ఆలోచించలేదు. తను బాకీపడ్డ ధూర్తుణ్ణి వెంటబెట్టుకుని బజారు కెళ్ళాడు. ఇంకో పది అప్పుతీసుకుని వాళ్ళ మావయ్య వాచీ పుచ్చుకున్నాడు. సరాసరి ఒక మార్వాడీ వాడి దగ్గర తాకట్టుపెట్టి అరవై తీసుకున్నాడు. వెంటనే వ్యవహారదక్షుడల్లే జూదరికి ఇరవై ఇచ్చేశాడు. ఆపైన ఒక్కడూ హోటలుకెళ్ళి కాఫీతాగి, పార్కు కెళ్ళి సిగరెట్టు ముట్టించి గురునాధరావల్లె, ఏడుపు సినిమాపాట ఒకటి పాడుకున్నాడు.

